అప్రమత్తతతో ఆనంద దీపావళి

- టపాసులు కాలుస్తున్నప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- ప్రమాదాలు జరగకుండా అధికారుల సూచనలు


ప్రతీకాత్మక చిత్రం

బాన్సువాడ/రాజంపేట: చిన్నా పెద్దా తేడా లేకుండా ఆనందోత్సాహాలతో గడిపే దీపావళి పండుగను ఈ నెల 31న జరుపుకోనున్నారు. ఆ రోజు బాణాసంచా కాలుస్తూ ఆనంద డోలికల్లో తేలుతారు. అయితే ఆ వెలుగుల మాటున ప్రమాదం పొంచి ఉంది. టపాసులు కాల్చే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించకపోతే తర్వాత బాధపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా పిల్లల విషయంలో పెద్దలు అప్రమత్తంగా ఉండాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీపావళి పండగను అందరు సంతోషంగా జరుపుకోవచ్చు.

అధికారులు పర్యవేక్షించాలి

దీపావళి పండుగకు వారం ముందు నుంచే జిల్లా వ్యాప్తంగా టపాసుల వ్యాపారం మొదలైంది. పలు చోట్ల ఎలాంటి అనుమతులు తీసుకోకుండా టపాసుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు నిత్యం టపాసుల విక్రయ కేంద్రాలను పర్యవేక్షిస్తుండాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పిల్లలను ఒంటరిగా టపాసులు కాల్చకుండా చూడాలి. పెద్దలు వారి పక్కనే ఉండాలి.
- టపాసులు కొన్ని పేలకుండా ఉండిపోతాయి. వాటిని తిరిగి వెలిగించే ప్రయత్నం అస్సలు చేయకూడదు. వాటి దగ్గరకు చిన్నారులు పోకుండా చూడాలి.
- పేలకుండా ఉండే వాటిపై ఎప్పటికప్పుడు నీరు పోసి తడిపేయడం ద్వారా ఎవ్వరికీ హాని కలుగకుండా చూడొచ్చు.
- ఎక్కువ ధ్వనిని ఇచ్చే బాంబులు వంటి వాటి వల్ల చెవి సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. వాటికి దూరంగా ఉండటం ఉత్తమం.
- వృద్ధులు, గుండె జబ్బులు ఉన్నవారికి సమీపంలో టపాసులు కాల్చకుండా చూడాలి. అలాగే, పసిబిడ్డలు ఉన్న ప్రాంతంలో కూడా పటాకులు కాల్చకుండా జాగ్రత్తపడాలి.
- రోడ్డుపై కాల్చేప్పుడు ప్రయాణికులను గమనిస్తుండాలి.
- టపాసులు కాల్చేప్పుడు అందరూ తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.
- క్రాకర్స్ కాల్చే సమయంలో నిప్పు రవ్వలు ఒంటిపై పడే అవకాశం ఉంటుంది. అందుకని కాటన్ దుస్తులు ధరించడం చాలా మంచిది.
- దుస్తులపై నిప్పురవ్వలు మంటలుగా వ్యాపిస్తే వెంటనే దుప్పటితో గానీ, మందపాటి రగ్గులు, కంబళితో కప్పేసి మంటలను ఆర్పేయాలి. ఇలాంటి వాటిని దగ్గరగా పెట్టుకోవాలి.
- క్రాకర్స్ పొరుగున ఉండే ఇళ్లు, వాహనాలపై పడి మంటలు అంటుకునే ప్రమాదం ఉంటుంది. అందుకని మంటలు ఆర్పేందుకు వీలుగా కంటైనర్‌లో నీరు సిద్ధంగా పెట్టుకోవాలి.
- ప్రమాదం జరిగినప్పుడు వెంటనే పిలిచేందుకు వీలుగా ఫైర్ సర్వీస్, అంబులెన్స్, పోలీస్ మొబైల్ టీం ఫోన్ నంబర్లను రాసి పెట్టుకోవాలి.
- నిప్పురవ్వలతో గాయాలు ఏర్పడి సెప్టిక్ కాకుండా ఉండేందుకు బర్నాల్, దూది, అయోడిన్, టించర్, డెట్టాల్ అందుబాటులో ఉంచుకోవాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందుబాటులో ఉంచుకోవటం చాలా మంచిది.
- క్రాకర్స్ ఎప్పుడూ ఇంట్లో కాల్చేందుకు ప్రయత్నించకూడదు. బహిరంగ ప్రదేశాల్లోనే పేల్చాలి. టపాసులను జేబుల్లో పెట్టుకొని తిరగొద్దు.
- గాయాలైనప్పుడు చల్లని నీటిని పోయాలి. నీరు అందుబాటులో లేకపోతే ఏదైనా తాగే పానీయమైనా పర్వాలేదు.
- గాయాలపై ఐస్‌తో మర్దన చేయకూడదు. అలాగే వెన్న, గ్రీజ్, పౌడర్ వంటివి రాయకూడదు.
- టపాసులు కాల్చిన తర్వాత చేతులతో కళ్లను తాకడం, ముక్కులో పెట్టుకోవడం చేయకూడదు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- క్రాకర్స్ కాల్చే సమయంలో సిగరెట్ తాగకుండా చూసుకోవాలి. వేడిని కలిగించే వస్తువులు, రసాయనాలు దగ్గరగా లేకుండా చూడాలి.
- చిన్నారులు ఎక్కువగా దగ్గరగా ఉండి టపాసులు కాలుస్తుంటారు. దీని వల్ల కంటి ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారు. కంటికి ఏమాత్రం ఇబ్బంది కలిగినా, కంటికి గాయమైనా ఆలస్యం చేయకుండా నేత్ర వైద్యుడ్ని సంప్రదించాలి. క్రాకర్స్ కాల్చేప్పుడు కళ్లకు అద్దాలను ఉపయోగించడం శ్రేయస్కరం.

అనుమతులు తీసుకోవాలి



టపాకాయలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే చర్యలు తప్పవు.

– వరప్రసాద్, తహసీల్దార్ బాన్సువాడ

పెద్దలు గమనిస్తూ ఉండాలి



ప్రతి ఇంటా దీపావళి పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. ముఖ్యంగా పిల్లలు టపాసులు కాల్చేటపప్పు పెద్దలు గమనిస్తూ ఉండాలి. మార్కెట్లోకి వివిధ రకాల టపాసుల వచ్చాయి. వాటి వల్ల ఆనందం కంటే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

– పుష్పరాజ్, ఎస్సై, రాజంపేట

జాగ్రత్తలు పాటించండి



ముందు జాగ్రత్తలు పాటించడం శ్రేయస్కరం. ప్రతి యేటా ఎంతో మంది గాయాల పాలైన సందర్భాలు చూస్తూ ఉన్నాం. టపాసులు కాల్చేటపుడు పెద్దలు చిన్నలు తప్పనిసరిగా ప్రాథమిక జాగ్రత్తలు పాటించాలి. లేదంటే జీవితాలు అంధకారం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

– విజయమహాలక్ష్మి, మెడికల్ ఆఫీసర్, రాజంపేట

బిచ్కుందను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా


యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


చెక్కులను అందజేస్తూ..

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుందను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం బిచ్కుందలో ఐటీఐ ఏటీసీ సెంటర్ సందర్శించి పరిశీలించారు. ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, తహసీల్దార్ సురేష్‌ను అడ్మిషన్లు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. యంత్ర సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, ఆధునాతన సాంకేతిక కోర్సులపై సీఎం ప్రత్యేక దృష్టి సారించి ఐటీఐ కళాశాలలను ఏటీసీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేశారని అన్నారు. డిగ్రీ కళాశాల న్యాక్‌లో ఏ–గ్రేడ్ సాధించిందని, అలాగే అటానమస్(స్వయం ప్రతిపత్తి) పొందడం చాలా సంతోషకరమని అన్నారు. తహసీల్దార్ సురేష్, వీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి, దేవర్‌శెట్టి అశోక్, గంగాధర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో భరోసా

నిజాంసాగర్(జుక్కల్): రోడ్డు ప్రమాద బాధితులతో పాటు ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలకు లక్షలు ఖర్చు చేసిన బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి కొండంత భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంగళవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో 160 మందికి రూ.1.9 కోట్ల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపత్కాలంలో ఉన్న వారిని ఆదుకోవడం నాయకుడి లక్షణమన్నారు. నాయకులు ఏలె మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, రమేష్‌యాదవ్, ఆకాష్, తోట రాజు తదితరులున్నారు.

పరామర్శ

పిట్లం(జుక్కల్): మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల కుటుంబ సభ్యులు ఇటీవల మృతి చెందడంతో వారి ఇంటికెళ్లి మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. రాంపూర్ గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బలరాం తండ్రి, అదేవిధంగా మద్దెలచెరువు గ్రామ అధ్యక్షుడు గంగారాం తల్లి ఇటీవల మృతి చెందడంతో వీరి కుటుంబాలను పరామర్శించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



బాన్సువాడ: దివాలి విత్ మై భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాన్సువాడలో పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్ పడిన వెంటనే వాహనాల ఇంజన్‌ను ఆపివేయాలని, దీని వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చునని అన్నారు. హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని అన్నారు. నెహ్రూ యువ కేంద్రం అధ్యక్షుడు సునీల్ రాథోడ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

దాడులు చేస్తే ఊరుకునేది లేదు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): హిందువులపై దాడులను నిరసిస్తూ మంగళవారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వర్తక, వ్యాపార సముదాయాలను మూసి వేయించారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. హిందువులపై, హిందువుల దేవాలయాలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదన్నారు. దాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు చిట్టెపు రాము, రంజీత్, జిరాక్స్ బాలయ్య, నిమ్మలబోయిన గంగాధర్, బత్తుల వెంకటేశ్, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్


మద్ది స్వామిని సన్మానిస్తున్న గంప గోవర్ధన్

భిక్కనూరు: రైతులకు సేవ చేయడం పూర్వ జన్మసుకృతమని, వారికి మెరుగైన సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం బస్వాపూర్ విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమితులైన మద్ది స్వామి గంప గోవర్ధన్‌ను కలిశారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్, మద్ది స్వామిని సత్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నినా కోర్టు న్యాయం చేసిందన్నారు. విండో డైరెక్టర్లు రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, రాజనర్సింహారెడ్డి, కిష్టారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్ చేయండి



కామారెడ్డి టౌన్: జిల్లాలో నిబంధనలు పాటించని ఆస్పత్రులపై దాడులు నిర్వహించి వాటిని సీజ్ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో లింగనిర్ధారణ చేసిన ఆస్పత్రిని శాశ్వతంగా సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోతిరాం, నర్సింలు, వెంకటిగౌడ్ తదితరులున్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి


ధన్వంతరి చిత్రపటానికి పూజలు చేస్తున్న వైద్యులు

కామారెడ్డి అర్బన్: ఆరోగ్య దేవుడు ధన్వంతరి జయంతి సందర్భంగా స్థానిక ఆయుర్వేద ఆస్పత్రిలో మంగళవారం 9వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. శ్రీధన్వంతరి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆయుర్వేద శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు కీర్తన, జి.దేవయ్య, కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, డీపీఎం శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో ఆయుర్వేద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్ర పటానికి ప్రత్యేక పూజలను ఆయుర్వేద వైద్యుడు వెంకటేశ్వర్లు జరిపారు. ఆయుర్వేద మందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫార్మాసిస్టు రమణి, కాంపౌండర్ మహిముద్ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫణిహారం రంగాచారికి నివాళులు



కామారెడ్డి టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఫణిహారం రంగాచారి 75వ వర్ధంతిని మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నేత వీఎల్ నర్సింహారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ క్యాతం సిద్దిరాములు పాల్గొన్నారు.

సస్పెండైన ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలి



దోమకొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన ఏఈవోలు నల్ల బ్యాడ్జీలతో నేలపై కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఈవోలు కృష్ణారెడ్డి, మనుష్య మాట్లాడారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సస్పెండైన 160 మంది ఏఈవోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో ఏఈవోల సమస్యలపైన చర్చించి పరిష్కార మార్గం చూపాలన్నారు.

బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించండి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. బస్టాండ్ నుంచి కాలనీకి వెళ్లేందుకు అనువుగా ఉన్న ప్రాంతంలో మురికి కాలువ నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉండడంతో కాలనీవాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని మురికి కాలువ నిర్మాణం పూర్తి చేసి, సీసీ రోడ్డు వేయాలని అన్నారు. కాలనీలో పెండింగ్ పనిని పూర్తి చేస్తానని మున్సిపల్ చైర్మన్ హామీ ఇచ్చారు. కాలనీవాసులు మహేష్, శ్రీనివాస్, రమేశ్ ఉన్నారు.

షరతుల్లేకుండా వడ్లను కొనుగోలు చేయండి


బీబీపేటలో మాట్లాడుతున్న నాయకులు


వినతి పత్రం అందజేస్తున్న బీకేఎస్ నేతలు


సదాశివనగర్‌లో తహసీల్దార్ గంగాసాగర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజేశ్వర్ తదితరులు

బీబీపేట: వడ్లను కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బీబీపేటలో ఆయన మాట్లాడారు. వడ్లను కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ బాలమణి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా

భిక్కనూరు: వరిధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ఆధ్వర్యంలో రైతులు బుధవారం భిక్కనూరు తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు కొనుగోళ్లను ప్రారంభించకపోవడం సిగ్గుచేటంటూ నినదించారు. అనంతరం తహసీల్దార్ శివప్రసాద్‌కు, ఎంపీడీవో, సూపరింటెండెంట్‌లకు వినతి పత్రాలను అందజేశారు. బీకేఎస్ మండల అధ్యక్షుడు నాగార్తి మల్లేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంటయ్య, ప్రతినిధులు రాజిరెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తూకాలు ప్రారంభించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాలను వెంటనే ప్రారంభించాలని మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు మంగళవారం తహశీల్దార్ గంగాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదరాబాదరాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు ప్రారంభించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి రైతులు రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు నర్సారెడ్డి, ఎల్లాగౌడ్, లచ్చిరాం నాయక్, మల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించాలి



నిజాంసాగర్(జుక్కల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదలపై టీచర్లతో పాటు తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బంజపల్లి అంగన్‌వాడి కేంద్రంలో అంగన్‌వాడి టీచర్లతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల్లో పదిహేను రోజులకు ఒకసారి చిన్నారుల ఎత్తు, బరువులను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు.

పారిశ్రామిక రంగంలో రాణించాలి



మాచారెడ్డి: విద్యార్థులు పారిశ్రామిక రంగంలో రాణించాలని పాల్వంచ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం పాల్వంచ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వృత్తి విద్యా కోర్సు విద్యార్థులను ఎలుపుగొండలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు పారిశ్రామిక రంగం టూర్‌లో భాగంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ అంటే ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది? ఒక సబ్ స్టేషన్ నుంచి ఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తారు అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పొదలను తొలగించాలి



ఎల్లారెడ్డిరూరల్: కాలనీలలో పెరిగిన పొదలను తొలగించాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులను ఆయన పరిశీలించారు. కాలనీలలో మురికి కాలువలను శుభ్రం చేయాలని అన్నారు. అనంతరం అయ్యప్ప ఆలయం ఆవరణలో మురికి నీటి గుంతలను పూడ్చి వేయించారు. కౌన్సిలర్లు శ్రీనివాస్, నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు పోచయ్య, విద్యాసాగర్, తదితరులున్నారు.

నగరవాటికను వినియోగంలోకి తీసుకురావాలి

ఎల్లారెడ్డి: నగరవాటికను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ శివారులోని నగరవాటికను పరిశీలించారు. ఏఈ వినోద్, కౌన్సిలర్లు నీలకంఠం, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్ తదితరులున్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



బీబీపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టీఎస్ఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సోహం అకాడమీ, రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలు నేర్పించారు. పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకాలను తప్పనిసరిగా వేయించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి రమేశ్ అన్నారు. కన్కల్‌లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. గాలికుంటు రోగం వస్తే పాల ఉత్పత్తి తగ్గుతుందని, కట్టిన పశువులు ఇడచుకుపోయే ప్రమాదం ఉందన్నారు. జాగ్రత్తల గురించి వివరించారు. రమేష్, పోచయ్య, కొండల్‌రెడ్డి, ప్రేం సింగ్, గంగారాం , బాలు, కిష్టయ్య, ఎల్లయ్య, మహిపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు హద్దులు

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయానికి చెందిన భూములకు హద్దులు వేస్తున్నామని ఆలయ సిబ్బంది వేణుకులకర్ణి తెలిపారు. మద్నూర్‌కు చెందిన విశ్రాంత వీఆర్వో సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయానికి రెండు ఎకరాల వ్యవసాయ భూమిని విరాళంగా అందించారు. మంగళవారం రెండు ఎకరాల భూమికి ఆలయ సిబ్బంది సర్వే చేసి హద్దులు వేశారు.

సంక్షిప్తం

విద్యార్థులకు బూట్ల పంపిణీ

భిక్కనూరు: తిప్పాపూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దళితవాడలో ఉన్న ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి రూ.45 వేలు వెచ్చించి బూట్లను అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు కొండ సిద్దరాములు, నేతలు కుంట లింగారెడ్డి, ధర్మయ్య, తాటిపల్లి సిద్దరాములు, భూమయ్య, నర్సారెడ్డి, హెచ్‌ఎం గడ్డం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రామారెడ్డి: 68వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పోసానిపేట్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సుశ్వంత్ రెడ్డి(9వ తరగతి) ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు సురేష్ తెలిపారు. వచ్చే నెల 7 నుంచి భువనగిరి జిల్లాలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని చెప్పారు. సుశ్వంత్ రెడ్డితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు నరేశ్ రెడ్డిని అభినందించారు.

ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు..



భిక్కనూరు: బస్వాపూర్‌కు చెందిన సందీప్ అనే యువకుడు ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం నుంచి చెన్నైలోని కాంచీపురంలో జరిగే సౌత్ ఇండియా లెవల్ పోటీల్లో సందీప్ పాల్గొనేందుకు బుధవారం బయలుదేరి వెళ్లాడు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు రూ. 8,300 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఫీజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్‌కుమార్ మాట్లాడారు. మూడేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. మరోవైపు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయన్నారు. టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రముఖ న్యాయవాది సిద్దిరాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, నాయకులు మణికంఠ, సమీర్, రాహుల్, నితిన్, సాయి, నవీన్, శివతేజ తదితరులున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఎల్లారెడ్డి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 52 మంది రక్తదానం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, అత్యవసర సమయంలో రక్తం అవసరమున్న వారి ప్రాణాలను నిలిపిన వారవుతారని అన్నారు. సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్, రెడ్‌క్రాస్ సొసైటీ నాయకులు ఉన్నారు.